క్లుప్తంగా

పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన అబ్జర్వర్లు శిల్పాగుప్తా, జనార్దన్, అజిత్ సింగ్‌లు

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా చేవెళ్లలోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఎన్నికల అబ్జర్వర్లు శిల్పాగుప్తా, జనార్ధన్, అజిత్ సింగ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు చేవెళ్ల అసెంబ్లీలోని పోలింగ్‌బూత్‌ల వారీగా ఉద్యోగులకు ఎన్నికల సామగ్రి అందుతున్నాయా? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరిచూసుకోవాలని చెప్పారు. మొత్తం ఎన్నికల నిర్వహణ వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాంను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలని సూచించారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

సీఐ రాజశేఖర్



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ రాజశేఖర్

మాడ్గుల: ప్రశాంతంగా స్వేచ్ఛయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. ఇప్పటికే మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు రౌడీషీటర్లను బైండోవర్ చేశామని, ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, నగదు తరలింపును నిలువరించామని తెలిపారు. శాంతియుత ఎన్నికలకు అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'జోరుగా పోల్ మేనేజ్‌మెంట్'

అత్తాపూర్: ప్రచార గడువు ముగిసిపోవడంతో రాజేంద్రనగర్ అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లను ఆకట్టుకునే పనిలో మునిగిపోయారు. మద్యం, డబ్బు పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఒక్కో ఓటు రెండు వేలతో ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చాలా చోట్ల మద్యం సీసాలు మంగళవారం సాయంత్రమే పంపిణీ అయినట్లు తెలుస్తోంది. వనరులు పుష్కలంగా ఉన్న అధికార పార్టీ రెండు సార్లు మద్యం పంపిణీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీతో పాటు ఇతర పార్టీలు కూడా పంపిణీ చేసినట్లు పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం జెండాలు, బ్యానర్లు లేకుండా నిశబ్ద వాతావారణం నెలకొంది. కాలనీల్లో పెద్దలతో ఓటు వేయించడం కోసం నోట్లు వేయించుకున్నట్లుగా సమాచారం. నిఘా యంత్రాంగం ఎంత కట్టడి చేసినా మద్యం పంపిణీనీ మాత్రం అడ్డుకోలేకపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

కందుకూరు: మండలంలోని కొత్తూర్‌కు చెందిన గురుస్వామి మీగడి చెన్నకేశ్వర్ ముదిరాజ్ 18వ మెట్టు అయ్యప్పస్వామి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అయ్యప్పదాసన్ పి.కేశవ్ గురుస్వామి, ఎ.కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజను జరిపించారు. అంతకు ముందు స్వామికి అభిషేకం, పూజ, 18వ సారి మాలా ధారణ చేసిన చెన్నకేశ్వర్‌ముదిరాజ్‌ను ప్రత్యేకంగా సన్మానించి స్వామి వారి ఆశీస్సులు అందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్, ఏనుగు జంగారెడ్డి తదితరులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

సొంతూళ్లకు ఓటర్లు..

బండ్లగూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమ ఓటును వినియోగించుకునేందుకు ప్రజలు తమ ఊళ్లకు పయనమయ్యారు. బతుకుదెరువు కోసం ఊళ్ల నుంచి వచ్చిన వారు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉంటూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో నగరానికి, ఊళ్లకు ఇది మధ్యలో ఉండటంతో ప్రజలు చాలా మంది బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జీవించేందుకు ఆసక్తి చూపుతుంటారు. కొడంగల్, తాండూర్, వికారాబాద్, చేవెళ్ల, షాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉంటుంటారు. ఇక్కడ నివసిస్తున్నప్పటికీ వారి చిరునామాలు, ఆధార్, ఓటర్ కార్డులు అన్ని ఊళ్లకు సంబంధించినవే ఉంటాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 30న ఉండటంతో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలు బుధవారం తమ సొంతూళ్లకు బయలుదేరారు.

ఓటు వేద్దాం.. చలో చలో

- నేడు పోలింగ్
- ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- సామగ్రిని పంపిణీ చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 2,36,338 మంది ఓటర్లు



ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు

షాద్‌నగర్: ప్రజలు తమ ఓటు హక్కుతో తమకనులమైన నేతను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరి కొద్ది గంటల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం 255 పోలింగ్ కేంద్రాలు...

నియోజకవర్గంలోని కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో మొత్తం 255పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో 91 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా పోలీసు అధికారులు గుర్తించారు. ఇలాంటి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మంచినీరు వసతి కల్పించడంతో పాటు దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు. అయితే ఈ సారి ఎన్నికల్లో మొత్తం 2,36,338 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

21 రూట్లలో విధుల్లో పోలింగ్ సిబ్బంది...

ఎన్నికలకు సంబంధించిన నియోజకవర్గంలో మొత్తం 21 రూట్లను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కృష్ణ తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితోపాటుగా అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, వెబ్ క్యాస్టింగ్ అధికారి, గార్డులు విధులు నిర్వహించనున్నారు. మొత్తం 1150 మంది పోలింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గం	షాద్‌నగర్
పోటీలో ఉన్న అభ్యర్థులు	14 మంది
మొత్తం ఓటర్లు	2,36,338
మహిళలు	1,17,278
పురుషులు	1,19,045
థర్డ్ జెండర్లు	15
ఎన్‌ఆర్‌ఐలు	0
సర్వీసు ఓటర్లు	0
పోలింగ్ బూతులు	255
సమస్యాత్మక కేంద్రాలు	91
విధుల్లో పోలింగ్ సిబ్బంది	1150
పోలీస్ సిబ్బంది	584

ఏర్పాట్ల పరిశీలన ..

ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు, ఈవీఎంల అప్పగింత కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని మినీస్టేడియంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి చంద్రకాంత్ కృష్ణారావు డాంగె, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు..

ఎన్నికల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు సిబ్బందితో పాటు ఆర్మీ రిజర్వుడ్ బలగాలను రంగంలోకి దింపినట్లు ఏసీపీ సురేందర్ తెలిపారు. ఎన్నికల విధుల కోసం మొత్తం 140 పారామిలటరీ, ఐదుగురు ఏసీపీలు, ఏడీసీపీ ఒకరు, సీఐలు 11, ఎస్‌ఐలు 7మంది, ఏఎస్‌ఐ, హెచ్‌సీలు 86 మంది, కానిస్టేబుళ్లు 224 మంది, హోంగార్డులు 36 మంది, ఏఆర్ పోలీసులు 56 మంది విధులు నిర్వహించనున్నారు. సీఐలు, ఎస్‌ఐలతో పాటుగా, పోలీసు సిబ్బంది 500 మంది, 76 మంది స్పెషల్ ఫోర్స్ పోలీసులను నియమించినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా

క్రసం	అభ్యర్థి	పార్టీ	గుర్తు
1.	అంజయ్య యాదవ్	బీఆర్‌ఎస్	కారు
2.	అందెబాబయ్య	బీజేపీ	కమలం
3.	ప్రశాంత్‌కుమార్	బీఎస్పీ	ఏనుగు
4.	వీర్లపల్లి శంకర్	కాంగ్రెస్	హస్తం
5.	విష్ణువర్ధన్‌రెడ్డి	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్	సింహం
6.	మంచాల బిక్షపతి	ధర్మసమాజ్ పార్టీ	బ్యాటరీ టార్చ్
7.	ఎండీ ఖాజా ముఫిజుద్దీన్	జై స్వరాజ్ పార్టీ	పెన్ నిబ్
8.	రహమద్దీన్	ఆల్ ఇండియా సమతా పార్టీ	పలక
9.	వినయ్‌కుమార్	విద్యార్థుల రాజకీయ పార్టీ	బ్యాట్
10.	అందారి అంజయ్య	స్వతంత్ర	రూం కూలర్
11.	తుప్పుడు నర్సయ్య	స్వతంత్ర	గ్యాస్ సిలిండర్
12.	నర్సింహ్మ రుస్తుం	స్వతంత్ర	రోడ్డు రోలర్
13.	మంచాల చంద్రమౌళి	స్వతంత్ర	హార్మోనియం
14.	రాఘువేందర్	స్వతంత్ర	ఎయిర్ కండీషనర్



ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న ఉద్యోగులు



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏసీపీ రంగస్వామి

గుర్తింపు కార్డు తప్పని సరి

- జాబితాలో పేరు ఉంటే
- 13 ధ్రువీకరణ పత్రాల్లో ఒకటి ఖచ్చితం

షాద్‌నగర్: ఎన్నికలు మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి. అధికారులు ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్లకు పోలింగ్ చిట్టీలను ఇప్పటికే పంపిణీ చేశారు. ఓటరు జాబితాలో పేరు ఉన్నా చాలా మందికి పోలింగ్ చిట్టీలు అందలేదు. ఓటరు కార్డు లేనివారు ఓటు వేయాలంటే ఫొటో గుర్తింపు కార్డు వెంట తీసుకెళ్లాలి. దీనికోసం ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. దాని ప్రకారం 13రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి వెంట తీసుకెళ్లాలని అధికారులు పేర్కొన్నారు.

ఓటరు స్లిప్‌తో..

ఓటు వేసేందుకు వెళ్లే వారు ఈ కింద తెలిపిన గుర్తింపు కార్డుల్లో ఒకటి తప్పని సరి వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓటరు గుర్తింపు కార్డు ఉన్న వారికి ఓటరు స్లిప్ నెంబర్ రాసి ఇస్తారు. ఫొటో ఓటరు స్లిప్, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, సర్వీసు గుర్తింపు కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ (ఫొటోతో ఉండాలి, మొదటి పేజీ ఉంటే సరిపోతుంది), పోస్టాఫీసు పాస్‌బుక్, స్మార్ట్‌కార్డు, పెన్షన్ పత్రం, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్‌కార్డు సరిపోతుంది.

డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి

కడ్తాల్: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం ఓ రైస్ మిల్లులో చోటు చేసుకుంది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దావేములోని బావితండా గ్రామ పంచాయతీకి చెందిన రమావత్ రాజునాయక్, భార్య సునీత (28)తో కలిసి బుధవారం ఉదయం వరి ధాన్యం నూర్పిడి కోసం కడ్తాల్‌లోని సప్తగిరి రైస్ మిల్లుకు వెళ్లారు. మిల్లు ఆవరణలో డ్రైవర్ అజాగ్రత్తగా ట్రాక్టర్‌ను రివర్స్ చేస్తూ సునీతను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కూతురు అంజలి, కుమారుడు రాంచరణ్ ఉన్నారు. రాజునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

సర్వం సిద్ధం

- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- చేరుకున్న సిబ్బంది



మొయినాబాద్: పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న సిబ్బంది



శంకర్‌పల్లి: ప్రొద్దటూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాల(ఈవీఎం)పంపిణీ కేంద్రాన్ని ఫరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి ఎన్నికల విధులకు నియమించిన సిబ్బంది, అధికారులు డిస్ట్రిబ్యుషన్ కేంద్రానికి చేరుకొని ఈవీఎంలను తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం 12గంటలనుంచే గ్రామాలకు వీటిని ప్రత్యేకబస్‌లద్వారా తీసుకెళ్లారు. చేవెళ్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సాయిరాం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి క్రిష్ణయ్యలు పర్యవేక్షణలో పాల్గొన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం చేవెళ్ల నియోజకవర్గంలో 2,62,005 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుష ఓటర్లు 1,32,631, మహిళా ఓటర్లు 1,29,370 మంది, ఇతరులు 4 మంది ఉన్నారు. 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుందని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 32 సమస్యాత్మకమైన పోలింగ్‌కేంద్రాలను గుర్తించి వాటిలో వెబ్‌క్యాస్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

సిబ్బంది వివరాలు..

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 298 పోలింగ్ బూత్‌లకుగాను దాదాపు 2,720 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటారని తెలిపారు.

ప్రత్యేక పోలింగ్ బూత్‌ల ఏర్పాటు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ బూత్‌లు నవాబ్‌పేటలో మాదారం పోలింగ్ బూత్ 20, మొయినాబాద్‌లో అమ్డాపూర్ 153, శంకర్‌పల్లిలో పోలింగ్ బూత్ 97, షాబాద్ మండల కేంద్రంలో పోలింగ్‌బూత్197, చేవెళ్ల మండలంలో ముడిమ్యాల 268లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికలాంగులకోసం ప్రత్యేకంగా షాబాద్ మండలంలోని పోతుగల్‌లో మహిళలకోసం నవాబుపేట మండలంలోని అర్కతల, శంకర్‌పల్లి మండలకేంద్రంలో పోలింగ్‌బూత్ 65, మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్‌లో షాబాద్ మండలంలోని తాళ్లపల్లిలో, చేవెళ్ల మండలంలోని తంగడపల్లిలో ఈప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మోడల్ పోలింగ్ కేంద్రాన్ని మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ పోలింగ్ బూత్ నెంబర్ 145ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గట్టి బందోబస్త్..

ఎన్నికల నేపథ్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల బందోబస్త్‌లో 359 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారని చెప్పారు. ఒక డీసీపీ, అడిషనల్ డీసీపీ, 3 ఏసీపీలు, 9 మంది సీఐలు, 14మంది ఎస్‌ఐలు, 4 ఏఎస్‌ఐలు, 16 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 199 మంది మహిళాకానిస్టేబుళ్లు, 82 మంది హోంగార్డులు, 40 మంది ఏఆర్ పీసీలు, 80 మంది సీఆర్‌పీఎఫ్ పీసీలు ఈ ఎన్నికల బందోబస్త్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లితో పాటు ఆయా మండలాల్లో జరగనున్న ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారికి మంచి నీటి సౌకర్యం, వృద్ధులకు వీల్‌చైర్‌లను అందుబాటులో ఉంచారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లో మొత్తం 69పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 64,341 మంది ఓటర్లకు పురుషులు 32,221, స్త్రీలు 32,120 ఓటు హక్కువినియోగించుకోనున్నారు. శంకర్‌పల్లి, మోకిల సీఐలు వినాయకరెడ్డి, నరేశ్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారని వారు పేర్కొన్నారు.

మొయినాబాద్‌లో..


మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధమైంది. నేటి ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. దీనికోసం బుధవారం సాయంత్రానికే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మొయినాబాద్ మండలంలో మొత్తం 57,660 మంది ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 29,417 మంది, మహిళలు 28,242 మంది కాగా థార్డ్‌జెండర్ ఒకరు ఉన్నారు. మండలంలో మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 6 మంది పోలింగ్ సిబ్బందితో పాటు వెబ్‌కాస్టింగ్, ఇతర సిబ్బంది చేరుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. శ్రీరాంనగర్, పెద్దమంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, బాకారం గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ డీసీపీ రష్మి కొన్ని గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆమె ఆదేశించారు.

షాబాద్‌లో..

షాబాద్: నేటి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు తహశీల్దార్ చిన్న అప్పలనాయుడు తెలిపారు. షాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో 53 కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సీఐ యాదయ్యగౌడ్ బలగాలను అప్రమత్తం చేశారు.



చేవెళ్ల : ఉద్యోగులకు సూచనలు సలహాలు ఇస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం



చేవెళ్ల: ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలి వెళ్తున్న ఉద్యోగులు

చేవెళ్ల ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు..

అభ్యర్థి	పార్టీ	గుర్తు
1. కాలె యాదయ్య	బీఆర్‌ఎస్	కారు
2. పామెన భీంభరత్	కాంగ్రెస్	హస్తం
3. కేఎస్ రత్నం	బీజేపీ	కమలం
4. రాజమహేంద్రవర్మ	బీఎస్పీ	ఏనుగు
5. ఎరుకలి కిరణ్‌కుమార్	మజ్లిస్ బచావో తెహ్రీక్	బ్యాట్
6. గిరగల్ల చిన్న మాణిక్యం	గణ సురక్ష పార్టీ	గ్యాస్ సిలిండర్
7. టి. దుర్గాప్రసాద్	ప్రజావెలుగు పార్టీ	కెమెరా
8. మేకల శ్రీనివాస్	ఇండియా ప్రజా బంధుపార్టీ	బాకా(ట్రంపెట్)
9. స్టాలిన్ రవీంద్ర మహారాజ్	ధర్మసమాజ్‌పార్టీ	బ్యాటరీ టార్చ్
10. తుడుము పాండు	ఇండిపెండెంట్	రోడ్‌రోలర్
11. బైండ్ల నర్సింలు	ఇండిపెండెంట్	విజిల్
12. మద్దెల సత్యనారాయణ	ఇండిపెండెంట్	ఫుట్‌బాల్

గ్రామాలకు తరలిన జనం

కిక్కిరిసిన బస్సులు, ప్రైవేటు వాహనాలు

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రజలు తమ సొంత ఊళ్లకు తరలారు. బతుకుదెరువుకోసం నగరంతో పాటు ఇతర జిల్లాలకు వెళ్లిన జనం తమ సొంత ప్రాంతాలకు చేరుకొని ఓటు వేయనున్నారు. హైదరాబాద్‌తోపాటు బండ్లగూడ, మొయినాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా పరిగి, తాండూరు, కొడంగల్, నారాయణపేట జిల్లాకు చెందిన చాలా మంది బుధవారం సాయంత్రమే సొంత ప్రాంతాలకు వెళ్లారు. గురువారం ఓటు వేసేందుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. కొడంగల్, పరిగి ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. బస్సుల్లో కిక్కిరిసి ఉండటంతో బస్సుటాప్‌పైన సైతం ఎక్కి సొంతూళ్లకు వెళ్తున్నారు.



మొయినాబాద్: హైదరాబాద్ నుంచి నారాయణపేటకు టాప్‌పై కూర్చుని వెళ్తున్న జనం

వలస ఓటర్లకు వల

- ఓటు కోసం ఆప్యాయంగా పలకరింపులు
- రాకపోకలకు ఫోన్‌పే గూగుల్ పే ద్వారా చెల్లింపులు

కొందుర్గు: తమ స్వంత గ్రామాల్లోని ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి పట్టణాల్లో నివాసం ఉంటున్న వలస ఓటర్లపై అన్ని పార్టీల నాయకులు దృష్టిసారించారు. వారితో ఫోనులో మాట్లాడుతున్నారు. తమ నాయకుల గెలుపు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఓట్లు రాబట్టడానికి వరుసలు కూడా కలిపేసుకుంటున్నారు. బాగున్నారా..ఏమి చేస్తున్నారు.. పిల్లలు బాగున్నారా.. మీ ఓటు మాకే వేయాలంటూ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. మన పార్టీకే ఓటు వేయాలి. మన ఎమ్మెల్యే తప్పకుండా గెలువబోతున్నారు. ఓడిపోయే వారికి వేయకండి. గెలిచే నాయకుడికి వేసినా మెజార్టీ పెరుగుతుందని ఓటర్లను కాకా పడుతున్నారు. గెలిచాకా మీకు ఇళ్లు కావాలన్నా.. పింఛన్ కావాలన్నా ఇప్పించే బాధ్యత తమదే అంటూ హామీలు గుప్పిస్తున్నారు. రాకపోకలకు సైతం ఖర్చులు పంపిస్తామని చెబుతూనే ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు తీసుకుంటున్నారు. ఈ తంతూ వలస ఓటర్ల కోసం అన్ని గ్రామాల్లోనూ సాగుతుంది.

విద్యార్థులు ప్రయోగాలవైపు దృష్టి మళ్లించాలి

కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణా

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు పరిజ్ఞానంతో పాటు ఆలోచన విధానాన్ని బట్టి కొత్తకొత్త ప్రయోగాలవైపునకు దృష్టి మళ్లించాలని కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రామకృష్ణా పేర్కొన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ కళాశాలలో 800 మంది విద్యార్థులు 'ప్రాజెక్టు ప్రదర్శన ఎగ్జిబిషన్‌ను ఎక్స్‌పో' అనే పేరుతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల క్యాంపస్‌లో ఈపీఐసీఎస్ ప్రాజెక్టు ఎక్స్‌పో ఐడియా థాన్ విద్యార్థులకు ఎంతో ఆకట్టుకున్నాయి. కొన్ని రోజులుగా మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రజాసేవలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్, ఉచిత వైద్య సేవలు, పలు కార్యక్రమాలు నిర్వహించి వాటిని ఈ ప్రదర్శనలో వివిధ ప్రాజెక్టుల ద్వారా ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులు ప్రపంచంలోని సామాజిక సేవలకు అనుగుణంగా రూపొందించారని ప్రిన్సిపాల్ అభినందించారు. సమాజంలో విలీనం అయ్యే విధంగా ప్రాజెక్టులను రూపొందించారన్నారు. ఆటోమెటెడ్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్స్, స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సోల్యూషన్స్, రెన్యూవల్ ఎనర్జీ, రీసైక్లింగ్, టెక్నాలజీ, హెల్త్ కేర్ వంటి ప్రాజెక్టులు ప్రదర్శించడం తోటి విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎం.సైదిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మా ఓట్లకు ఎంతిస్తారు!

కందుకూరు: నెల రోజుల పాటు సాగిన ఓట్ల జాతరకు ముగింపు సమయం ఆసన్నమైంది. హామీలు, ఆరోపణలు, విమర్శలే ప్రధాన అస్త్రాలుగా అభ్యర్థులు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. పోలింగ్‌కు ఒక్క రోజు మాత్రమే సమయం ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను చివరి నిమిషంలో ప్రసన్నం చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. తమ అనుచరులను పంపించి నగదు పంపిణీకి తెర లేపారు. ప్రజలు సైతం ఏ పార్టీ వారు ఎంత ఇస్తారో అని తలుపులు తెరిచి ఉంటున్నారు. తమకు ఓట్లు వేస్తారనే నమ్మకం ఉన్న ఓటర్లకు మాత్రమే ఓ పార్టీ అభ్యర్థి పంపిణీ చేయిస్తుండగా, మరో పార్టీ అంత కంటే ఎక్కువ మందికి ఇస్తున్నట్లు సమాచారం. మూడో ప్రధాన పార్టీ బుధవారం సాయంత్రం వరకు నగదు పంపిణీ ప్రారంభించలేదు. ప్రధాన పార్టీల పంపిణీ ముగిసిన తర్వాత వారు ఎంత మేర ఇచ్చారో చూసుకుని, రాత్రి వేళ పంపిణీ చేయడానికి నిరీక్షిస్తుంది. కాగా ఒక్కో పార్టీ దాదాపుగా రూ.వెయ్యి మేర నగదు పంపిణీ చేసినట్లు సమాచారం. కాగా సందడిలో సడేమియగా గ్రామాల్లో కొందరు నాయకులు ఓటర్లకు పంచే నగదులో కొంత మిగిలిచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో కొందరికీ రూ.వెయ్యి మరికొందరికీ రూ.500 వరకు పంపిణీ చేస్తున్నారు. దీంతో పక్క వారి కంటె తక్కువ వచ్చిన వారు గొడవకు దిగుతున్నారు.